క్లుప్తంగా

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు



ఆదిత్యుని పూజల్లో పాల్గొన్న భక్తులు

పెదపూడి: జి.మామిడాడ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆదివారం పంచామృతాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక వ్రత పూజలు చేయించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా గంగాలమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో గంగాలమ్మ తల్లి

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట శివారు మలిరెడ్డి వారి మామిడితోటలో కొలువై ఉన్న గంగాలమ్మతల్లి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మూడువేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. మలిరెడ్డి కుటుంబాలకు చెందిన వారంతా అమ్మవారికి సామూహిక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించారు.

ఘనంగా మదుగులమ్మ తీర్థ మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో మదుగులమ్మ తల్లి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామదేవత మదుగులమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ జంగా మురళీ కృష్ణ, లక్ష్మీగణపతి ఆలయ కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈలకొలనులో ఉచిత వైద్య శిబిరం

రంగంపేట: ఈలకొలను గ్రామంలో ఆదివారం శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వేమగిరి పరమహంస యోగానంద నేత్ర వైద్యాలయం వైద్యులు ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 125 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి 13 మందికి కంటి ఆపరేషన్లు, మరో 30 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు అన్నారు. శిబిరంలో ఆప్తమాలజిస్ట్ సురేష్, కన్వీనర్ తిక్కిశెట్టి సుబ్బారావు, కోఆర్డినేటర్ దుర్గ, ప్రశాంతి సేవల ఇన్‌చార్జి తిక్కిశెట్టి గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు డాక్టర్ సత్యం రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి చెందిన రామకృష్ణ మిషన్ , వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

నేడు కోరుకొండలో పారిజాత గిరి ప్రదక్షిణ

రాజానగరం: కోరుకొండపై కొలువైవున్న లక్ష్మీ నరసింహస్వామి పారిజాత గిరి ప్రదక్షిణ సోమవారం జరుగనుంది. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని దేశ సంచార యాత్రికునిగా పేరొందిన దివాన్‌చెరువుకు చెందిన పెన్నాడ మోహన సారథ్యంలో కొంతమంది భక్తులు గ్రామంలోని లక్ష్మీగణపతిని దర్శించుకుని సాయంత్రం 5 గంటలకు దివాన్‌చెరువు నుంచి బైకులపై కోరుకొండకు చేరుకుంటారు. సుమారు మూడు కిలోమీటర్లు ఉన్న పారిజాత గిరి చుట్టు ప్రదక్షిణ చేసి, కొండ మెట్లు ఎక్కి స్వామిని దర్శించుకుని తిరిగి దివాన్‌చెరువుకు చేరుకుంటారు. మాఘ పౌర్ణమి సందర్భంగా చేపడుతున్న ఈ ప్రదక్షిణలో ఆసక్తి ఉన్న భక్తులు పాల్గొనవచ్చని మోహన్ తెలిపారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

రాజానగరం: మండలంలోని శ్రీకృష్ణపట్నంలో సీతారాముల కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా చేశారు. శ్రీకృష్ణపట్నంతోపాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి, స్వామివార్లను దర్శించుకున్నారు.

ముందు జాగ్రత్తే శ్రీరామరక్ష

- పశువుల్లో పెరుగుతున్న లంపీ స్కిన్ వ్యాధి
- పాడిరైతులు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పశువైద్యులు



లంపీ స్కిన్ వ్యాధి సోకిన ఆవు

పెదపూడి: పశువుల్లో లంపీ స్కిన్ వ్యాధి తీవ్రత రోజురోజుకీ తీవ్రమవుతోంది. ప్రధానంగా ఆవులు, ఎద్దుల్లో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. పశువుల శరీరంపై చిన్న బొడిపెగా మొదలయ్యే ఈ వ్యాధి క్రమంగా శరీరమంతా వ్యాపించి పుండ్లు ఏర్పడుతున్నాయి. ఆయా పశువులు తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాయి. ఈ వ్యాధి ఒక పశువు నుంచి ఇతర పశువులకు త్వరితగతిన వ్యాపిస్తున్న నేపథ్యంతో పాడిరైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు.

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల్లో లంపీ స్కిన్ వ్యాధి కనిపిస్తుంది. అనపర్తి, పెదపూడి, బిక్కవోలు, రంగంపేట, రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో మొత్తంగా 32,560 ఆవులు, 4,450 ఎద్దులు ఉన్నట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారమే ఇటీవల ఆయా ప్రాంతాల్లోని సుమారు 180 ఆవులకు, ఎద్దులకు లంపీ స్కిన్ వ్యాధి సోకినట్లుగా గుర్తించారు. అనధికారికంగా దానికి నాలుగైదు రెట్ల తీవ్రత ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఒక్క పెద్దపూడి మండలంలోనే 46 పశువులకు వ్యాధి సోకినట్లుగా ఇటీవల లెక్క తేల్చారు. తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పశువైద్యులు శిబిరాలు ఏర్పాటుచేసి వ్యాక్సిన్లు వేస్తున్నారు. అయితే వ్యాధి వచ్చాక చికిత్స కంటే ముందు జాగ్రత్తలతోనే పశువుల్ని రక్షించుకోవడం మేలని నిపుణులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివి

లంపీ స్కిన్ అనేది పాక్స్‌విరిడే, కార్డో పాక్స్ విరినే అనే వైరస్‌ల వల్ల వస్తుంది. ఇది బొద్దింకల వంటి కీటకాల కారణంగా అత్యంత వేగంగా ఒక పశువు నుంచి మరో పశువుకు వ్యాపిస్తుంది. అందుకే పశువుల పాకను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వైద్యుల సూచనలతో దోమలు, ఈగలు, బొద్దింకల నివారణకు క్రిమిసంహారక మందులు చల్లాలి. జబ్బు చేసిన పశువుకు మేత వేసినప్పుడు అది తిని వదిలేసిన గడ్డిని వేరొక పశువు తింటే లాలాజలం ద్వారా వ్యాధి వ్యాపిస్తుంది. ఈ కారణంగా వ్యాధి సోకిన పశువులను మిగిలిన పశువుల నుంచి వేరు చేసి దూరంగా ఉంచాలి. వ్యాధితో బాధపడుతున్న పశువులను పశువైద్యులకు చూపించి నొప్పి నివారణ మందులను ఇవ్వాల్సి ఉంటుంది. పశువు శరీరంపై ఏర్పడిన పుండ్ల మీద బోరిక్ పౌడర్ లేదా జింక్ ఆక్సైడ్ పౌడర్‌ను గ్లిజరిన్‌లో కలిపి రాస్తే త్వరగా మానిపోతాయి. వ్యాధి సోకిన పశువులకు రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది కనుక వాటికి బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలి.

పశువుల్ని రక్షించుకోవచ్చు



పాడి రైతులు ముందు జాగ్రత్తలు తీసుకుంటే లంపీ స్కిన్ నుంచి పశువుల్ని రక్షించుకోవొచ్చు. వ్యాధి సోకిన పశువులను ఇతర పశువులకు దూరంగా ఉంచడం ఎంతో కీలకం. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్యులను సంప్రందించాలి. సకాలంలో చర్యలు చేపడితే వ్యాధి నివారణ సాధ్యమే.
– చింతా కిరణ్మయి, మండల పశువైద్యాధికారి, పెదపూడి

జీఐఎస్ విజయవంతం శుభ పరిణామం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అనపర్తి: ఈ నెల 3, 4 తేదీల్లో విశాఖపట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్) విజయవంతం కావడం శుభపరిణామమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జీఐఎస్ విజయంతో రాష్ట్రంలో లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. పారిశ్రామిక రంగంపై శ్రద్ధ చూపుతున్న సీఎం జగన్ రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పించారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ పరిపాలన, నాయత్వంపై ఉన్న నమ్మకంతో ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామిక దిగ్గజాలు జీఐఎస్ వేదికగా లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపారన్నారు. ప్రతిపక్ష నేతగా ఉండగా అధికారంలోకి వస్తే పెట్టుబడుల కోసం దావోస్ వెళ్లడం కాదు, దావోస్‌నే రాష్ట్రానికి రప్పిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన మాటను నిజం చేశారని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్

సీతానగరం: మండలంలోని సింగవరం ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఈబి సీఐ సీపీ రావు ఆదివారం సీజ్ చేసి, స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విలేకరులతో మాట్లాడుతూ సింగవరం ర్యాంపు నుంచి తరలిస్తున్నది బొండు ఇసుక అన్నారు. అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేస్తామని అన్నారు.

1,500 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పెదపూడి: జి.మామిడాడలో నల్లమిల్లి వెంకటరెడ్డి, భాస్కరలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సాధారణ, చర్మ, యూరాలజీ, గుండె, నరాలు, గాస్ట్రో ఎంట్రాలజీ, చిన్న పిల్లలు, చెవి ముక్కు గొంతు, ఎముకలు, దంత, కంటి వైద్య నిపుణులు వాడ్రేవు రవి, శ్రీరామచంద్రుడు, హర్షవర్ధన్, ఓబుల్‌రెడ్డి, భార్గవి, గౌతమ్ ప్రవీణ్, సత్తి వెంకటరెడ్డి, దుర్గాప్రసాద్ బీమాల, ఎస్.వెంకటరెడ్డి తదితరులు సుమారు 1,500 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 98 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించగా మరో 378 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు.

ట్రస్ట్ వైస్ చైర్మన్ సుభాష్‌రెడ్డి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక రోటరీ క్లబ్ ఫౌండర్ నల్లమిల్లి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో కోస్తా ఆంధ్రారెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథ్‌రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు తాడి చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి సత్తి వీర్రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు నల్లమిల్లి గణేష్ సత్య వెంకటరెడ్డి, కార్యదర్శి లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవంలో గాయపడ్డ వారిని పరామర్శించిన ఎంపీ భరత్



గాయపడ్డ వారిని పరామర్శిస్తున్న ఎంపీ భరత్‌రామ్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): కోరుకొండ లక్ష్మీ నరసింహ స్వామివారి రథోత్సవంలో గాయపడిన యువకులను వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆదివారం పరామర్శించారు. రథోత్సవంలో గాయపడ్డ కాపవరం గ్రామానికి చెందిన కాపారపు నాగబాబు, కనుపూరు గ్రామానికి చెందిన కూర్మదాసు శ్రీనివాస్ నగరంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. వారిని ఎంపీ పరామర్శించారు. కాపారపు నాగబాబు కుడి కాలు తొలగించినట్లు వైద్యులు ఎంపీకి తెలిపారు. మరో క్షతగాత్రుడు కూర్మదాసు శ్రీనివాస్ కాలికి సోమవారం చికిత్స చేయనున్నట్లు తెలిపారు. వారికి. మెరుగైన వైద్యం అందజేయాల్సిందిగా వైద్యులను ఎంపీ భరత్ కోరారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు ఎంపీ భరత్ ధైర్యం చెప్పారు.

చెరువులో మట్టి తవ్వకాల అడ్డగింపు

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి గ్రామ శివారున ఉన్న రాజుచెరువులో మట్టి తవ్వకాలను టీడీపీ నాయకులు ఆదివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గునిపే భరత్ మాట్లాడుతూ చెరువులో మట్టిని అక్రమంగా లే అవుట్‌లు, ఇటుక బట్టీలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి చెరువులో అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



బాలుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి, శివ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

గోకవరం: గ్రామంలో అరుదైన సీజీడీ వ్యాధితో బాధపడుతున్న రెండున్నరేళ్ల బాలుడు సత్యశ్రీఅక్షయ్‌రామ్ వైద్యానికి శివ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. బాలుడి వైద్యానికి రూ.30 లక్షల వరకూ ఖర్చవుతుందని తెలుసుకున్న అసోసియేషన్ సభ్యులు రూ.30 వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని ఆదివారం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు చేతుల మీదుగా బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. బాలుడి వైద్యానికి సహకారం అందించిన శివ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను ఎంపీపీ దంపతులు అభినందించారు. దాతలు ముందుకొచ్చి బాలుడి వైద్యానికి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఎస్ఎస్ అలీషా, వాకచర్ల రవి, కట్టా సూర్యప్రకాష్‌రావు, రామోజు దుర్గ, అద్దంకి వెంకటేశ్వరరావు, వంకా వీరబాబు, మైపాల సతీష్ నాగులకొండ భద్రరావు, బత్తుల రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఇంటి పన్ను వసూళ్లు

- పంచాయతీ కార్యదర్శులతో స్పెషల్ డ్రైవ్
- నియోజకవర్గంలో రూ.8.96 కోట్ల వసూళ్ల లక్ష్యం
- 72 శాతం పూర్తి చేసిన అధికారులు



నూరు శాతం పన్ను వసూలైన ఊలపల్లి పంచాయతీ కార్యాలయం

బిక్కవోలు: ఆర్థిక సంవత్సరం మరో 25 రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో అధికారులు ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీ కార్యదర్శులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ గ్రామాల్లో ఇంటింటికీ పంపిస్తున్నారు. అనపర్తి నియోజకవర్గంలో ఇప్పటికే 72 శాతం వసూళ్లు పూర్తి చేసి లక్ష్యం దిశగా అడుగులేస్తున్నారు.

ఆ గ్రామాలు ఆదర్శం

అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో మొత్తంగా రూ.8,96,35,601 ఇంటి పన్ను వసూళ్లను లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకూ 72 శాతం మేర అంటే రూ.6,48,72,910 వసూలు చేశారు. మరో రూ.2,47,62,691 వసూలు కావాల్సి ఉంది. ప్రధానంగా కొప్పవరం, పులుగుర్త, తొస్సిపూడి, కొమరిపాలెం, ఊలపల్లి తదితర గ్రామ పంచాయతీల్లో నూరు శాతం పన్ను వసూలైంది. దీంతో ఆయా పంచాయతీల్ని ఆదర్శంగా చూపిస్తూ ఇతర గ్రామాల్లోను అదే విధమైన ఫలితాల కోసం పంచాయతీ కార్యదర్శులు శ్రమిస్తున్నారు. క్షేత్రస్థాయిలో వలంటీర్ల సహకారం తీసుకుని లక్ష్యంగా దిశగా అడుగులేస్తున్నారు. రంగంపేట, అనపర్తి మండలాల్లోని కొన్ని పంచాయతీల్లో వసూళ్లు నెమ్మదిగా ఉన్న నేపథ్యంలో అధికారులు ప్రధానంగా ఆయా ప్రాంతాలపై దృష్టి సారించినట్లు తెలుస్తుంది.

100 శాతం వసూలు చేస్తాం



మార్చి 31వ తేదీ లోగా వందశాతం పన్ను వసూలు చేస్తాం. పంచాయతీ కార్యదర్శులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. వెనకబడి ఉన్న గ్రామ పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించాం.
– బి.భవానీ, ఈవోపీఆర్డీ, బిక్కవోలు మండలం

క్రీడలతో మానసికోల్లాసం

- వైఎస్సార్ యువజన విభాగం నేత జక్కంపూడి గణేష్
- బూరుగుపూడి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం
- ఈ నెల 11వ తేదీ వరకు నిర్వహణ



జక్కంపూడి గణేష్‌ను సత్కరిస్తున్న నాయకులు

మధురపూడి: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని వైఎస్సార్ యువజన విభాగం నేత జక్కంపూడి గణేష్ అన్నారు. ఆదివారం కోరుకొండ మండలం బూరుగుపూడి ఊరచెరువు సమీపంలోని గ్రౌండ్‌లో బూరుగుపూడి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. క్రీడా పోటీలను నిర్వహించడం మంచి కార్యక్రమమన్నారు. తొలుత రిబ్బన్ కట్‌చేసి పోటీలను ప్రారంభించారు. జక్కంపూడి రామ్మోహనరావు చారిటబుల్ ట్రస్టు పేరిట అనేక క్రీడా పోటీలను నిర్వహించిన సంగతిని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో బూరుగుపూడి క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న యువతను ఆయన అభినందించారు. కోరుకొండ మండలం పరిధిలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో 32 టీమ్‌లు తలపడుతున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ నెల 11 వతేదీన బహుమతుల ప్రదానోత్సవం జరుగుతున్నట్టు, మొదటి బహుమతిగా రూ.2,5000, ద్వితీయ బహుమతిగా రూ.15,000తో పాటు ట్రోఫీ బహుమతి కూడా అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా బ్యాటింగ్ చేసి బంతులను ఆయన బౌండరీ వైపునకు కొట్టి అందరీ్న అబ్బుర పర్చారు. ఈ సందర్భంగా నాయకులు జక్కంపూడి గణేష్ బాబును శాలువా, పూల మాలలతో సత్కరించారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే పోటీలతో క్రీడా సందడి ఏర్పడింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు క్రొవ్విడి సత్రాజు, కంటే వినయ్ తేజ, పిట్టా కృష్ణ, చీంద్రిం శ్రీహరి, టోర్నమెంట్ నిర్వాహకులు ఏడిద పండు, పిల్లి క్రాంతి పాల్గొన్నారు. అనంతరం రాజమహేంద్రవరం రూరల్ మండలానికి చెందిన వెంకటనగరం టీమ్ రాయుడుపాకలు టీమ్‌తో తలపడి విజయాన్ని కైవసం చేసుకుంది. రాజానగరం మండలానికి చెందిన సీతారాంపురం టీమ్ బూరుగుపూడి టీమ్‌తో తలపడి గెలుపొందింది.

గాయపడ్డ నాగబాబు కుటుంబాన్ని ఆదుకుంటాం



నాగబాబు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న రమేష్‌బాబు, ట్రస్టుబోర్డు సభ్యురాలు రజనీరెడ్డి

మధురపూడి: కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి రథోత్సవంలో గాయపడ్డ కాపవరపు నాగబాబు కుటుంబానికి తగిన పరిహారాన్ని అందిస్తామని అన్నవరం దేవస్థానం డిప్యూటీ ఈఓ రమేష్‌బాబు అన్నారు. రాజమహేంద్రవరం ప్రైవేటు హాస్పిటల్‌ల్లో చికిత్స పొందుతున్న నాగబాబును ఆయన పరామర్శించారు. శుక్రవారం కోరుకొండ తీర్థం సందర్భంగా నిర్వహించిన రథోత్సవంలో ప్రమాదవశాత్తు నాగబాబు కాలు నుజ్జునుయిన సంగతి తెల్సిందే. ఆయన్ను ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా హాస్పిటల్‌ల్లో చేర్చి వైద్యం అందజేస్తున్నారు. కాగా నాగబాబు పరిస్థితిని తెల్సుకున్న డిప్యూటీ ఈఓ రమేష్‌బాబు, అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు తాడి రజనీరెడ్డితో కల్సి హాస్పిటల్‌కు వెళ్లారు. అక్కడ బాధితుడిని, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. విషయాన్ని ఉన్నతాధికారులతో చర్చించి పరిహారాన్ని అందించడానికి కృషి చేస్తానన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

సామాజిక చైతన్యానికి అక్షరమే ఆయుధం

దివిజ కవితా సంకలనం ఆవిష్కరణ



దివిజ కవితా సంకలనాన్ని, ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

అనపర్తి: సామాజిక చైతన్యానికి అక్షరమే ఆయుధమని సాహితీ గోదావరి సంస్థ ప్రతినిధి, గోదావరి కవి, వీఎస్ఎం కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ ర్యాలి శ్రీనివాస్ అన్నారు. గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి చాగంటి సుబ్రహ్మణ్యం రచించిన 'దివిజ' కవితా సంకలనం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక చైతన్యంతో పాటు, సమాజ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటును అందించే అంశాలను ఆధారంగా చేసుకుని కవులు తమ రచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో రచయిత భమిడిపాటి గౌరీశంకర్, సాహితీవేత్త దుర్భా శ్రీరామమూర్తి, వారణాసి సత్తిబాబు, ఆర్‌పీ రాజా, రిటైర్డ్ ప్రిన్సిపాల్ గంగరాజు, జౌళిశాఖ రిటైర్డ్ ఉద్యోగి సత్యనారాయణలు పాల్గొని ప్రసంగించారు.

విద్యార్థులతో సైకిల్ ర్యాలీ



గుమ్ములూరులో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

మధురపూడి: ప్రతీ ఒక్కరూ సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్యాన్ని స్వంతం చేసుకోవచ్చని దోసకాయలపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం కోరుకొండ మండలం గుమ్ములూరులో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు గొర్రెల లక్ష్మణరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించగా, విద్యార్థులు ఉల్లాసంగా సైకిల్ తొక్కారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మనుష్యుల వ్యక్తిగత ఆరోగ్యాన్ని సంరక్షించాలన్న లక్ష్యంతో రోజూ సైకిల్ తొక్కండి–ఆరోగ్యాన్ని కాపాడుకోండనే నినాదం ఇచ్చినట్టు తెలిపారు. కరోనా తర్వాత రోగనిరోధక శక్తి సన్నగిల్లిన నేపథ్యంలో సైకిలింగ్‌తో పాటు, పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు జాకబ్‌రాజు, దోసాకాయలపల్లి పీహెచ్‌సీ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ పాల్గొన్నారు.

గడప గడపతో జోరందుకున్న అభివృద్ధి



మురుగునీటి కాలువల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మధురపూడి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అభివృద్ధికి బాటలు వేసింది. కోరుకొండ మండలం మధురపూడి గ్రామంలో 900 మీటర్ల విస్తీర్ణంలో మురుగునీటి కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జాతీయ రహదారి నుంచి హైస్కూల్ వరకూ కిలోమీటరు విస్తీర్ణంలో వీధిలైట్లు ఏర్పాటు చేయనున్నారు. దానిలో భాగంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గణేశుల పోసి ఆదివారం కొబ్బరికాయ కొట్టి నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సెక్రటరీ సురేష్‌బాబు, పార్టీ నాయకులు బత్తిన త్రిమూర్తులు, ఇండిగుమెల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

కల్యాణ మంటప పనులకు శ్రీకారం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురులో కల్యాణ మంటప నిర్మాణ పనులకు ఆదివారం శ్రీకారం చుట్టారు. గ్రామంలో శంకరమ్మ చెరువు వద్ద గతంలో మార్కెట్ షెడ్డు నిర్మించినా అది నిరుపయోగంగా ఉండడంతో దాన్ని కల్యాణ మంటపంగా మార్చాలని నిర్ణయించుకున్నారు. కల్యాణ మంటప నిర్మాణానికి ఆర్థిక సాయం చేసేందుకు శ్రావణి హాస్పిటల్ ఈఎన్‌టీ వైద్యులు సత్తి వీర్రెడ్డి ముందుకు రావడంతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో స్పీకర్ ఓఎస్‌డీ పడాల సత్యనారాయణరెడ్డి(బాబ్జీ),సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, ఎంపీటీసీలు కొంకుదురు పీవీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, సత్తి బులివీర్రెడ్డి పాల్గొన్నారు.

మాంసాహార దుకాణాల్లో తనిఖీలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా విజిలెన్స్ ఎస్పీ పీవీ.రవికుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి చికెన్, మటన్, చేపల షాపులలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వస్తువులపై ముద్రించిన ధర కంటే ఎక్కువ ధరకు, తూనిక, కొలతల్లో వ్యాపారులు వినియోగ దారులను మోసం చేస్తున్నట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామన్నారు. తూకం తేడా, ఎలక్ట్రానిక్ కాటాలకు స్టాంపింగ్ లేకపోవడం వంటివి గుర్తించి జిల్లాలోని అనపర్తి మండలంలో నాలుగు, కడియం మండలంలో నాలుగు కేసులు నమోదు చేశారు.